Digital, tmedia.net.in

www.tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 116
సంచిక : 236
పేజీలు : 4
గురువారం, మే 07, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## సూడా చైర్మన్‌గా పువ్వాల దుర్గాప్రసాద్ నియామకం



**టీ మీడియా,మే06,హైదరాబాద్/ఖమ్మం:**ఖమ్మం స్థంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సూడా) చైర్మన్‌గా శ్రీ పువ్వాల దుర్గాప్రసాద్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (జనరల్ ఎల్ ఎ సి) శాఖ జీఓ ఆర్‌టీ నెం.603ను బుధవారం జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పువ్వాల దుర్గాప్రసాద్ రెండు సంవత్సరాల కాలానికి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఈ కాలం అమల్లోకి వస్తుంది.నియామకానికి సంబంధించిన షరతులు, నియమాలు ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణరావు ప్రభుత్వం తరపున జారీ చేశారు.

# మున్సిపల్ పాలన ముగింపు

### అభివృద్ధి, రాజకీయాలు, ప్రజా ఆశలపై ప్రత్యేక కథనం

## నేటి తో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం






**టీ మీడియా , మే 6,ఖమ్మం:** నగర పాలనలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం 2026 మే 7తో అధికారికంగా ముగియనుంది. గత ఐదేళ్లుగా నగర అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, పచ్చదనం, పట్టణ ప్రణాళిక వంటి అనేక అంశాల్లో పాలకవర్గం చేపట్టిన కార్యక్రమాలు నగర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.కోవిడ్ సంక్షోభం నుంచి వరదల వరకు ఎన్నో సవాళ్ల మధ్య ఖమ్మం కార్పొరేషన్ పాలకవర్గం తన పదవీకాలాన్ని పూర్తి చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రజల ఆశలు, ప్రభుత్వ సహకారం, రాజకీయ ఒత్తిళ్ల మధ్య సాగిన ఈ ఐదేళ్ల ప్రయాణంపై ఇప్పుడు నగరవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

**ఎన్నికల నుంచి పదవీకాల ముగింపు వరకు.**

2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ ఘన విజయం సాధించగా, ఖమ్మం నగర పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. అభివృద్ధి హామీలతో అధికారంలోకి వచ్చిన పాలకవర్గం నగరాన్ని ఆధునికీకరణ దిశగా తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది.పదవీకాల ప్రారంభంలోనే కోవిడ్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో పారిశుద్ధ్యం, వైద్య సేవలు, క్వారంటైన్ సెంటర్లు, మాస్క్ పంపిణీ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత నగర అభివృద్ధి పనులు వేగం అందుకున్నాయి.

**రోడ్లు -- అంతర్గత వీధుల అభివృద్ధి**

నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అనేక డివిజన్లలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మించారు. కాలనీల్లో మట్టి రోడ్ల సమస్య కొంతవరకు తగ్గిందని ప్రజలు చెబుతున్నారు.

**డ్రైనేజీ, వరద నియంత్రణ చర్యలు**

వర్షాకాలంలో నీటి నిల్వ సమస్య తీవ్రంగా ఉండే ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేశారు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు తగ్గించేందుకు ప్రత్యేక పనులు చేపట్టారు.

**పారిశుద్ధ్యం -- డోర్ టు డోర్ చెత్త సేకరణ**

స్వచ్ఛత కార్యక్రమాల భాగంగా డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ వ్యవస్థను బలోపేతం చేశారు. అనేక ప్రాంతాల్లో చెత్త బుట్టలు, ట్రాక్టర్లు, ప్రత్యేక పారిశుద్ధ్య వాహనాలు అందుబాటులోకి వచ్చాయి.

**పచ్చదనం -- పార్కులు, అవెన్యూ ప్లాంటేషన్**

నగర సౌందర్యవర్థక కార్యక్రమాల్లో భాగంగా పలు సెంటర్లలో మొక్కలు నాటడం, పార్కుల అభివృద్ధి, డివైడర్ల అందీకరణ చేపట్టారు.

**స్ట్రీట్ లైట్లు -- ఎల్‌ఈడి వ్యవస్థ**

పాత వీధి దీపాల స్థానంలో అనేక ప్రాంతాల్లో ఎల్‌ఈడి లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్ ఖర్చు తగ్గడంతో పాటు వెలుతురు సమస్య కూడా కొంతవరకు తగ్గింది.

**విమర్శలు -- ప్రజల్లో అసంతృప్తి కూడా...**

అభివృద్ధి పనులు జరిగినప్పటికీ కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.కొన్ని డివిజన్లలో డ్రైనేజీ సమస్యలు కొనసాగడం,వర్షం పడితే రోడ్లు దెబ్బతినడం,ట్రాఫిక్ సమస్యలు పెరగడం,అనధికార నిర్మాణాలపై చర్యలు తక్కువగా ఉండడం,
పట్టణ విస్తరణకు సరిపడ మౌలిక వసతులు లేకపోవడం.ప్రతిపక్ష పార్టీలు పాలకవర్గంపై అవినీతి, పనుల నాణ్యత వంటి అంశాల్లో విమర్శలు చేశాయి. అయితే అధికార పార్టీ మాత్రం ప్రభుత్వ నిధులతో ఖమ్మం రూపురేఖలు మార్చామని చెబుతోంది.

**రాజకీయంగా కూడా కీలక కాలం**

ఈ ఐదేళ్లలో ఖమ్మం నగర రాజకీయాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర రాజకీయ

మిగతా 3లో



### స్నేహితులతో సరదాగా వెళ్లి
## 13 ఏళ్ల బాలుడు మృతి

**టీ మీడియా, మే 6, కొణిజర్ల:**బంధువుల పెళ్లి వేడుకకు వచ్చిన ఓ బాలుడు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన కొణిజర్ల మండలంలోని చిన్న గోపతి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపూడి గ్రామానికి చెందిన బాల్దే వెంకటేశ్వర్లు (వెంకన్న), నాగేంద్ర దంపతుల కుమారుడు అరవింద్ (13) ఏడో తరగతి పూర్తి చేశాడు. కుమార్తె మనీషా ఇంటర్ చదువుతోంది. అరవింద్ తన నాయనమ్మతో కలిసి చిన్న గోపతి గ్రామంలో జరుగుతున్న బంధువుల పెళ్లి వేడుకకు వచ్చాడు.పెళ్లి సందడిలో భాగంగా అరవింద్ తన స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు ఈతకు వెళ్లాడు. అయితే అరవింద్‌కు ఈత రాకపోయినా స్నేహితులతో కలిసి బావిలోకి దిగినట్లు సమాచారం. నీటి లోతును అంచనా వేయలేక బావిలో మునిగిపోవడంతో అక్కడున్న స్నేహితులు భయాందోళనకు గురై గ్రామస్తులకు సమాచారం అందించారు.వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు బావిలో గాలించి అరవింద్‌ను బయటకు తీశారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు.ఇప్పటివరకు తమతో సరదాగా ఆడుకున్న బాలుడు విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా

మిగతా 3లో

# మానవాళి విముక్తి సిద్ధాంతమే మార్క్సిజం

### -సిపియం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం




**టీ మీడియా , మే 6,ఖమ్మం :**సమస్త ప్రజలను దోపిడీ నుంచి విముక్తి చేసే సిద్ధాంతమే మార్క్సిజం అని సిపియం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.స్థానిక సుందరయ్య భవనంలో సిపియం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన జరిగిన మార్క్సిజం సమకాలీనత సవాళ్ళు అనే అంశంపైన జరిగిన చర్చా కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించి మార్క్సిజం ప్రాధాన్యత గురించి వివరించారు. పెట్టుబడిదారీ సమాజంలో ఆర్థిక సంక్షోభం రోజు రోజుకు తీవ్రమవుతోందని ఆయన అన్నారు.ఇప్పుడు ఇది యుద్ధ రూపంలో ప్రపంచాన్ని కబళించేలా ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. ఇది ఒక దేశానికి ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదని, ఇది ప్రపంచ వ్యాపిత సమస్య అని తెలిపారు. దీని వలన నిరుద్యోగం,ధరల పెరుగుదల విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అంకెలు, జీడీపీ లెక్కలలో దేశ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలపడుతున్నట్లు పెట్టుబడిదారీ మీడియా సంస్థలు, మేధావులు ఊదరగొడుతున్నారని ఇదంతా తప్పుడు ప్రచారమని ఆయన తెలిపారు. ప్రజల యొక్క కొనుగోలు శక్తి తీవ్రంగా తగ్గిపోతోందని దీంతో ప్రజలు కనీస అవసరాలను కూడా తీర్చుకునేందుకు అవసరమైన వస్తు సేవలను వినియోగించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభ కాలంలో ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు ప్రజలను గాలికి వదిలేసి పెట్టుబడిదారులకు,కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే పనిలో ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాలు ఇలానే పెట్టుబడుదారుల, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ప్రయోజనాల కోసమే పని చేస్తాయని, ప్రజలను దోచుకునే వారికి పూర్తి స్థాయిలో సహకరిస్తాయని మార్క్స్ చేసిన విశ్లేషణను ఆయన వివరించారు. సమాజంలో అందరికీ సౌకర్యవంతమైన జీవన ప్రమాణాలు అందాలంటే దోపిడి వర్గ పెట్టుబడిదారీ సమాజంలో అది సాధ్యం కాదని ఆయన తెలిపారు. ఏయే బడా వ్యాపారవర్గాలు,కార్పొరేట్ కంపెనీలైతే ప్రజల శ్రమను జ్ఞానాన్ని దోచుకొని సంపదను తమ ఇళ్ళకు తరలిస్తున్నాయో ఆ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడినప్పుడే సమస్త సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఈ పోరాటాన్నే మార్క్స్ వర్గ పోరాటం అన్నారని , వర్గ పోరాటం ద్వారానే ప్రజలందరికీ అనుకూలమైన మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు

మిగతా 3లో



## పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**టీ మీడియా, మే 6,ఖమ్మం:**జిల్లాలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సింథటిక్ ట్రాక్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆదేశించారు.లకారం ట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పరిశీలించారు. ఖానాపురం హవేలీ ఊర చెరువు నుంచి ధంసలాపురం వరకు నిర్మిస్తున్న ట్రంక్ మెయిన్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధంసలాపురం వద్ద ఎస్‌టీపీ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని సమీప చెరువులకు విడుదల చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ట్రంక్ మెయిన్‌కు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం సింథటిక్ ట్రాక్ పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన చిన్నపాటి పనులను వచ్చే రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి ఉపయోగానికి సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ పనులు తనిఖీ సందర్భంగా పబ్లిక్ హెల్త్ డిఈ నవీన్ కుమార్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, క్రీడా కోచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## నూతన వధూవరులకు మాజీ ఎంపీ నామ ఆశీస్సులు

**టీ మీడియా, మే 6, ఖమ్మం:** నగరంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన వడ్లమూడి సత్యనారాయణ--సుభద్రల కుమార్తె వనజ వివాహం, బోనకల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన తాత సావిత్రి కుమారుడు గోపీనాథ్‌తో ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హాజరైన నామ నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని రోటరీ నగర్‌లో జక్కంపూడి వీరభద్రరావు--నిర్మల నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఇటీవల వివాహం జరిగిన వారి కుమారుడు, కోడలను దీవించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణప్రసాద్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను విస్మరించడం చట్టరీత్యా నేరం

**అమ్మ సేవాసదనాన్ని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి భవాని**

**టీ మీడియా, మే 6, అశ్వారావుపేట**

వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం, వారి ఆలనా పాలనను సంతానం విస్మరించరాదని, అలా చేస్తే అది చట్టరీత్యా నేరమని దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జేఎఫ్సీఎం బి.భవాని హెచ్చరించారు. బుధవారం అశ్వారావుపేటలోని అమ్మ సేవాసదనాన్ని ఆమె సందర్శించి ఆసరా లేని వృద్ధులతో మాట్లాడారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఆమె, ఆశ్రమంలో అందుతున్న ఆహార వసతులు, సంరక్షణపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను బిడ్డలు నిర్లక్ష్యం చేయడం వల్ల వారు వృద్ధాశ్రమాల్లో చేరాల్సి వస్తోందని, ఇది సమాజానికి మంచిపరిణామం కాదని అన్నారు. కుటుంబ పెద్దలు మన వారసత్వ సంపద అని, వారి సంరక్షణ ప్రతి కుటుంబ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ప్రతి నెలా 50 కిలోల బియ్యం అందజేయనున్నట్లు దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బార్ అసోసియేషన్ కార్యదర్శి లక్కినేని నరేంద్రబాబు, న్యాయవాదులు ముప్పిడి శ్యాం సుధాకర్, తుమ్మ రాంబాబు, గోళ్ల భవాని కృష్ణయాదవ్, నల్లపు ఉదయ్ కుమార్, కాలం సంధ్యారాణి, టి. అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 23వ డివిజన్ అభివృద్ధికి చిరునామా

**-మక్బూల్ సేవలు అభినందనీయం**

**టీ మీడియా, మే 6, ఖమ్మం:**23వ డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందిన మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆయన పదవీకాలం ముగిసిన సందర్భంగా ముస్తఫానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఘన అభినందన సభ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా హాజరై పుష్పగుచ్చాలు, శాలువాలతో మక్బూల్‌ను సత్కరించారు. సభ అంతా అభిమానంతో, భావోద్వేగంతో నిండిపోయింది.ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ 23వ డివిజన్‌ను అభివృద్ధి దిశగా నడిపించిన నాయకుడు మక్బూల్ అని ప్రశంసించారు. రాజకీయాల్లో వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ, ప్రజల సంక్షేమాన్నే ధ్యేయంగా తీసుకుని పనిచేసిన ఆయన సేవలు అభినశీదనీయమని పేర్కొన్నారు .కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజలకు అండగా నిలిచి ఉచిత మందుల పంపిణీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, అంగన్‌వాడీల అభివృద్ధి, పార్కుల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా కమ్యూనిటీ హాల్ ద్వారా నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో మక్బూల్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు .అనంతరం మాజీ కార్పొరేటర్ షేక్ మక్బూల్ మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా కుటుంబానికి ఎంత ప్రాధాన్యత ఇస్తానో, నా డివిజన్ ప్రజలకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తాను. ప్రజల ఆశీస్సులు, నాయకుల ప్రోత్సాహమే నా రాజకీయ ప్రస్థానానికి బలం,' అని పేర్కొన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతోనే అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టగలిగానని చెప్పారు.నేను పార్టీ మారే ప్రసక్తే లేదు. నా శ్వాస ఉన్నంతవరకు గులాబీ జెండా నీడలోనే కొనసాగుతాను,' అంటూ బీఆర్ఎస్ పట్ల తన నిబద్ధతను స్పష్టం చేశారు. ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుంటానని, పదవి ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేయడం



ఆపబోనని హామీ ఇచ్చారు.మాజీ కార్పొరేటర్ షేక్ మహబూబ్ అభినందన సభలో ఏర్పాటు చేసిన 23వ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు చెందిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మక్బూల్ స్నేహితులు షేక్ ఇస్మాయిల్, గడ్డం లింగమూర్తి, సభాధ్యక్షులు రాంరెడ్డి, లియావత్ అలీ, కన్నోజు కిరణ్ కుమార్, సయ్యద్ షఫీ, స్థానిక బి ఆర్ఎస్ నాయకులు ఎస్ కే ఇలియాస్, ఎస్కే లాల, కరీముల్లా, సలీం, అజ్జు, 21 వ డివిజన్ అధ్యక్షులు ఉస్మాన్, మునాఫ్, జాకీర్, ఎంపీజే అధ్యక్షులు ఖాసిం విశ్రాంత డ్రైవర్ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు హకీమ్, బి ఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, నసీర్, మహిళ సంఘం నేతలు ఎల్ ఝాన్సీ, సలీమా బేగం, జ్యోతి, విమల, ఆర్పీ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సరఫరా

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**-జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం**



**టీ మీడియా, మే 6,భద్రాద్రి కొత్తగూడెం:**ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల రైతుల వారోత్సవంలో భాగంగా విత్తనాలు, ఎరువుల డీలర్లకు అవగాహన, వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువుల సన్నద్ధతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత శాఖల అధికారులు, విత్తనాలు మరియు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6,59,743 ఎకరాల్లో సాగు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1 లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, 1.75 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు అవుతున్నాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో అధిక దిగుబడులు సాధించామని, ఈ వానాకాలంలో కూడా అదే స్థాయిలో ఉత్పత్తి లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గుర్తింపు పొందిన సంస్థల నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించి ప్రభుత్వ నిర్దేశించిన ధరలకు పారదర్శకంగా విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదన్నారు.ఎరువుల నిల్వలు, సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని పేర్కొంటూ జిల్లా మరియు మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల సరఫరా ఎంతో సున్నితమైన అంశమని, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులు కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు లభిస్తాయని భావించి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితులు ఉండవచ్చని, అలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు లేదా ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. గత సంవత్సరంలో జిల్లాలో ఐదు నకిలీ విత్తనాల కేసులు నమోదయ్యాయని, ఈసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఎరువుల వినియోగం, నిల్వ, నాణ్యత ప్రమాణాలు, స్టాక్ నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు విధానాలపై డీలర్లకు సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు ఎరువుల డీలర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పాలన ముగింపు

పరిణామాలు, పార్టీ మార్పులు, స్థానిక నేతల ప్రభావం మున్సిపల్ పాలనపై కూడా ప్రభావం చూపాయి. కార్పొరేటర్ల మధ్య విభేదాలు, అధికార-ప్రతిపక్ష ఆరోపణలు కూడా కొన్ని సందర్భాల్లో హాట్ టాపిక్ అయ్యాయి.

**ఇక ముందు ఏమిటి?**

పాలకవర్గం పదవీకాలం ముగియడంతో తదుపరి పరిపాలనపై ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించే అవకాశముందనే చర్చ జరుగుతోంది. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలే ప్రధాన అజెండాగా మారే అవకాశముంది.ఖమ్మం నగర ప్రజలు ఇప్పుడు కొత్త పాలకవర్గం నుంచి మరింత ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ఆశిస్తున్నారు.

**ప్రజల అభిప్రాయం**

రోడ్లు బాగయ్యాయి... కానీ డ్రైనేజీ సమస్య ఇంకా ఉంది" అని కొందరు చెబుతుండగా, "గతంతో పోలిస్తే నగరం అభివృద్ధి చెందింది" అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

మొత్తానికి ఖమ్మం నగర పాలనలో ఈ ఐదేళ్ల అభివృద్ధి , విమర్శలు -- రాజకీయాల



మిశ్రమ కాలంగా నిలిచిపోయాయి.



## అమ్మ పిల్లల ఆస్పత్రిని సందర్శించిన మున్నూరు కాపు నాయకులు

**టీ మీడియా, మే 6, మధిర:**మధిర మున్సిపాలిటీ వైరా రోడ్డులో నిర్మించిన 'అమ్మ పిల్లల ఆస్పత్రి'ను మధిర నియోజకవర్గ మున్నూరు కాపు నాయకులు సందర్శించారు. ఆస్పత్రి వ్యవస్థాపకులు, కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ దగ్గుపాటి శ్రీను ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ఆధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆళ్ళ కృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనును సత్కరించారు. అనంతరం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు నాయకులు, కాంగ్రెస్ నాయకులు నీలం వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు, దేవిశెట్టి కృష్ణ, లంకె మల్ల నాగేశ్వరరావు, వీరశెట్టి సీతారాములు, ధనిశెట్టి భాస్కర్, చెన్నం స్వామి, చిన్నం వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీను, పాలెపు వెంకటేశ్వరరావు, సిద్దు కృష్ణ, ఇల్లూరి నవీన్, పగడాల శివ, నల్గొండ నరసింహారావు, శంకర్ శెట్టి వెంకటేశ్వరరావు, మత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### స్నేహితులతో సరదాగా వెళ్లి

విలపించారు. పెళ్లి వేడుక కోసం వచ్చిన బంధువులంతా ఈ ఘటనతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు.
ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మానవాళి విముక్తి సిద్ధాంతమే మార్క్సిజం

ప్రజలకు ఓపికగా వివరిస్తూ,చైతన్య పరుస్తూ వారిని వర్గ పోరాటాలకు సిద్ధం చేయడమే కమ్యూనిస్టుల కర్తవ్యం అని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు నిరంతరం పాలక దోపిడీ వర్గాలకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తూ ఉంటారు కాబట్టే వారి శక్తిని తగ్గించే ప్రయత్నం చేస్తారని అన్నారు. అందులో భాగంగానే ఎన్నికలలో కమ్యూనిస్టులను ఓడించడం కోసం అన్ని రకాల దోపిడీ వర్గ పార్టీలు ఏకం అవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు కూడా తగ్గుతాయని ఇది సాధారణ విషయమని తెలిపారు. అయితే కమ్యూనిస్టుల బలం కేవలం ఓట్లు సీట్లల్లో మాత్రమే ఉండదని వారి బలం ప్రజలను ఐక్యం చేస్తూ ప్రజా ఉద్యమాలను నిర్మించే కృషిలో ఉంటుందని అన్నారు. ఈ పనిని ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజలను అంటి పెట్టుకొని వారిని కుల మత ఇతర విభజన వాదాలకు అతీతంగా ఐక్య పరచడం ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ తరహా సిద్ధాంత కార్యాచరణ విశ్లేషణను కార్ల్ మార్క్స్ చాలా స్పష్టంగా తన రచనలో చేశారని అన్నారు. ఈ అవగాహనతో ప్రజలతో మమైకమై ప్రజల కోసం పని చేయడం ద్వారానే కార్ల్ మార్క్స్ కు నిజమైన నివాళి అర్పించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపియం సీనియర్ నాయకులు యం.సుబ్బారావు,సిపియం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు,కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, విద్యా విభాగం నాయకులు బోడపట్ల రవీందర్ , రఫీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో రైతు వారోత్సవాలు

**-పంట వ్యర్థాలను తగులబెట్టొద్దు**

**టీ మీడియా, మే 6, కామేపల్లి:**ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా కామేపల్లి మండలంలోని రైతు వేదికల్లో బుధవారం “రైతు వారోత్సవాలు”నిర్వహించారు. ప్రాథమిక సహకార సంఘాలు, సహకార , బ్యాంకింగ్ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పంట రుణాలు, ఆధునిక సాగు పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించారు.కొమ్మినేపల్లి రైతు వేదికలో జరిగిన సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామానికి “సాయిల్ వాలంటీర్”లను నియమించిందని, వారి ద్వారా భూసార పరీక్షలు చేయించుకోవాలని రైతులకు సూచించారు. గత నెలలో సేకరించిన మట్టి నమూనాల ఫలితాల కార్డులను ఈ సందర్భంగా రైతులకు అందజేశారు.పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా నేలలోని మిత్ర పురుగులు నశించి భూమి నిస్సారమవుతుందని పుల్లయ్య హెచ్చరించారు. మొక్కజొన్న, వరి, పత్తి వంటి పంటల వ్యర్థాలను భూమిలోనే కలిపి దున్నడం ద్వారా సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూసారం పెరుగుతుందని తెలిపారు.సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా రైతులకు ఎంతో ప్రయోజనకరమని అధికారులు వివరించారు. ఇది మొక్కల పత్ర రంధ్రాల ద్వారా నేరుగా శోషించబడుతూ 80 శాతం వరకు ఉపయోగపడుతుందని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యం, పంటల మార్పిడి విధానం, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతపై కూడా రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. తారాదేవి, ఏఈఓలు వేదిత, దీపక్ రెడ్డి, భాస్కర్, జగదీశ్వర్, ఉష పాల్గొన్నారు. అలాగే కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హనుమంతరావు, కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఆత్మ డైరెక్టర్ ధమలపాటి సత్యనారాయణ, సంఘాల కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.



# సాగునీటి సమస్య పరిష్కారం

**మంత్రి తుమ్మల కృషి అభినందనీయం**

**టీ మీడియా, మే 06, కామేపల్లి:**కామేపల్లి మండలంలో శాశ్వత సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, టీపీసీసీ సభ్యుడు పుచ్చకాయల వీరభద్రం, మాజీ పీఎస్ఎస్ అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆర్.ఎం. రవి, మాజీ ఎంపీటీసీ గబ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి కీలకమైన బుగ్గవాగు ఎడమ వరద కాలువ పనులకు సవరించిన అంచనాలకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం లభించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా కామేపల్లి మండలంలోని 25 కుంటలు, 24 గ్రామాలకు చెందిన సుమారు 2019 ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటి సౌకర్యం అందనున్నదని తెలిపారు.అదేవిధంగా రఘునాథపాలెం మండలంలోని 13 గ్రామాలకు చెందిన 31 చెరువులు కూడా బుగ్గవాగు ద్వారా నిండే అవకాశం ఉండటంతో రైతులకు శాశ్వత సాగునీటి పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టుదలతోనే ఈ పనులు సాధ్యమయ్యాయని, గతంలో కూడా కామేపల్లి మండలంతో పాటు ఇల్లందు నియోజకవర్గంలోని దూరప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి మంత్రి విశేష కృషి చేశారని కొనియాడారు.



# గర్లా రిజర్వ్ ఫారెస్ట్ మైనింగ్‌పై హైకోర్టు కీలక తీర్పు

**టీ-మీడియా ,మే 6 , ఖమ్మం :** ఖమ్మం జిల్లాలోని గర్లా రిజర్వ్ ఫారెస్ట్‌లో బారైట్, డోలమైట్ మైనింగ్ కార్యకలాపాలపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం వెలువరించింది. అటవీ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ నోటీసులను సమర్థిస్తూ, మైనింగ్ కంపెనీలు మరియు లేబర్ కాంట్రాక్టర్లు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. జస్టిస్ నాగేష్ భీమపాక ఈ కేసులో విచారణ జరిపి, రెవెన్యూ శాఖ చేసిన తప్పిదాల వల్లే రిజర్వ్ ఫారెస్ట్ భూములను “సర్కారీ భూమి”గా చూపించి మైనింగ్ లీజులు ఇచ్చారని తీవ్రంగా వ్యాఖ్యానించారు. దీంతో దాదాపు 760 ఎకరాల అటవీ భూమి దశాబ్దాలుగా నష్టపోయిందని కోర్టు పేర్కొంది. ఈ వివాదం ఖమ్మం జిల్లా గర్లా మండలంలోని పోచారం, శ్రీపురం గ్రామాల పరిధిలోని భూములకు సంబంధించినది. అటవీ శాఖ వాదన ప్రకారం, ఈ భూములు 1951లో అప్పటి నిజాం ప్రభుత్వం ప్రకటించిన 44,582 ఎకరాల గర్లా రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగం. అయితే తప్పుదారి పట్టించిన రెవెన్యూ రికార్డుల ఆధారంగా తరువాత మైనింగ్ లీజులు మంజూరు అయ్యాయి. 2009లో అటవీ శాఖ, ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్--1980 ప్రకారం అవసరమైన అనుమతులు లేకుండా మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ స్టాప్ వర్క్ నోటీసులు జారీ చేసింది. దీనిపై మైనింగ్ సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. 2013లో హైకోర్టు ఆదేశాలతో సర్వే ఆఫ్ ఇండియా భూసరిహద్దులపై ప్రత్యేక సర్వే నిర్వహించింది. ఆ నివేదికలో సుమారు 762 ఎకరాలు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోనే ఉన్నాయని, కేవలం 2.77 ఎకరాలు మాత్రమే బయట ఉన్నాయని వెల్లడైంది. ఈ సర్వే పారదర్శకంగా జరిగిందని కోర్టు స్పష్టం చేసింది. మైనింగ్ సంస్థలు గతంలో పర్యావరణ అనుమతులు పొందామని, దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని వాదించినప్పటికీ, అటవీ సంరక్షణ చట్టపరమైన బాధ్యతకు ఇవి మినహాయింపుకాదని హైకోర్టు తేల్చి చెప్పింది. కొన్ని మైనింగ్ లీజులు గడువు ముగిసిపోయాయని, మరికొన్ని కార్యకలాపాలు ప్రారంభం కాలేదని కూడా కోర్టు పేర్కొంది.

